


మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం






## మధు గురూజీని వరించిన సేవా సామ్రాట్ అవార్డు

భానుపురి/హైదరాబాద్

గత 25 సంవత్సరాలుగా జ్ఞాన ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగా, వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు, వృద్ధాశ్రమం, ఆయుర్వేద ప్రచారం, తీర్థయాత్రలు తదితర అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజ సేవలో విశిష్ట సేవలు అందిస్తున్న జ్ఞాన ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సూర్యాపేట పట్టణానికి చెందిన మధు గురూజీకి "సేవా సామ్రాట్" అవార్డు లభించింది. హైదరాబాద్‌కు చెందిన జీవన వాహిని ఛారిటబుల్ ట్రస్ట్ మధు గురూజీ సేవలను గుర్తించి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపిక చేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పబ్లిక్ గార్డెన్ నందు జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శ్రీ సత్యసాయి ధ్యానమండలి వ్యవస్థాపకులు, సద్గురువు బిక్షమయ్య గురూజీ హాజరై మధు గురూజీని ఘనంగా సన్మానించి "సేవా సామ్రాట్" అవార్డును అందజేసి అభినందనలు తెలిపారు. గత 25 సంవత్సరాలుగా యోగా, ఆధ్యాత్మికత, వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్యం, వృద్ధుల సంక్షేమం తదితర రంగాల్లో మధు గురూజీ చేస్తున్న సేవలు సమాజానికి స్ఫూర్తిదాయకమని కార్యక్రమంలో పలువురు కొనియాడారు. అనంతరం సేవా సామ్రాట్ అవార్డు గ్రహీత మధు గురూజీ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసిన జీవనవాహిని చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ధనలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు. సేవ అనేది ఒక కార్యక్రమం మాత్రమే కాదని అది ప్రతి మనిషి బాధ్యత అన్నారు. గత 25 సంవత్స రాలుగా జ్ఞాన ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించే అవకాశం లభించడం నా అదృష్టంగా భావిస్తున్నాని తెలిపారు. నాకు లభించిన ఈ 'సేవా సామ్రాట్' అవార్డు వ్యక్తిగత గౌరవంగా కాకుండా, సేవా మార్గంలో నాతో కలిసి నడుస్తున్న ప్రతి ఒక్కరికి దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు ప్రకటించారు. ఈ పురస్కారం నాకు మరింత బాధ్యతను, మరింత స్ఫూర్తిని అందించిందని హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టి, అవసరమైన వారికి అండగా నిలిచి, సమాజానికి మరింతగా ఉపయోగపడేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న శిష్యులు, మిత్రులు, అభిమానులు, దాతలకు పేరు పేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మధు గురూజీకి ఈ అవార్డు లభించడం పట్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన శిష్యులతోపాటు, సూర్యాపేట పట్టణ ప్రజలు, జ్ఞాన ఫౌండేషన్ సభ్యులు, కుటుంబ సభ్యులు, మిత్రులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ మధు గురూజీకి అభినందనలు తెలిపారు.



## పోలీస్ గ్రీవెన్స్ డేలో బాధితుల పిర్యాదుల పరిష్కారం



భానుపురి/సూర్యాపేట ఎస్పీ కార్యాలయం.

సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పి నరసింహ పిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఫిర్యాదులకు సంబంధించి బాధితులు ఎస్పి ని ప్రత్యక్షంగా కలిసి వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పి ప్రతి ఒక్క బాధితుడి సమస్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులుతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఎస్పి తెలిపారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## నాలుగో రోజు నారి మణుల బుల్లెట్ ట్రైన్ ఉద్యమరిలే నిరాహార దీక్షలు

భానుపురి /సూర్యాపేట టౌన్



జాతీయ రహదారి 65 వెంట బుల్లెట్ ట్రైన్ మంజూరు చేసి అలైన్మెంట్ మార్చిన విధానంపై ఈ నెల 14నుండి కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాలుగో రోజు చేరాయి. అఖిలపక్షాల ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణం వాణిజ్య భవన్ సెంటర్లో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో పి ఓ డబ్ల్యు మహిళా నాయకులు కూర్చున్నారు. ప్రజల ఓట్లతో గద్దెనెక్కిన నేతలు ప్రజా సంక్షేమాలకు ఎగనామం పెడుతుంటే చూస్తూ ఊరుకునేది లేదని దీక్షలో మహిళా మణులు హెచ్చరించారు. ఈ రిలే నిరాహార దీక్షలో నాలుగవ రోజు పిఓడబ్ల్యూ ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక ఆధ్వర్యంలో దీక్షలో కూర్చున్నవారు మరసాని చంద్రకళ ,కట్టా కల్పన, సూరం రేణుక ,ఐతరాజు పద్మ ,భీమనపల్లి పద్మ, శెట్టిపల్లి గౌరమ్మ ,గుండ గాని రేణుక, చందన పోయిన లక్ష్మి ,వేమనూరు పావని ,సిరికొండ శ్యామల, ఎస్కే పర్వీన్ ,చెరుకు అరుణ లు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు.

## వినియోగదారుల మన్ననలు పొందాలి





భానుపురి/సూర్యాపేట టౌన్

వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ వారి మన్ననలు పొందాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలాజీ గ్రాండ్ హోటల్‌లో గ్రీన్‌ల్యాండ్ హోటల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హోటల్ కు వచ్చే వినియోగదారులకు నాణ్యమైన ఆహారం, అందించి వారి ఆదరణ పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, కౌన్సిలర్ షేక్ మన్సూర్ బీ ఫారుక్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాధి, వనగంటి సతీష్, రాచకొండ శ్రీనివాస్, జూలకంటి నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, హోటల్ నిర్వాహకులు కె రఘువీర్ రెడ్డి, వెన్న వికాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సర్-2 వ దశ కార్యక్రమంలో అప్రమత్తంగా ఉండాలి

భానుపురి/యాదాద్రి భువనగిరి

సర్-2 కార్యక్రమాన్ని అశ్రద్ధ చేయకుండా అప్రమత్తంగా ఉండాలని, పార్టీ అన్ని స్థాయిలలో నాయకులు సమన్వయంతో పని చేయాలని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి మీనాక్షి నటరాజన్, రాష్ట్ర నీటిపారుదల శాఖామాత్యులు అన్నారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం సమీపంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య అధ్యక్షతన జరిగిన సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ ప్రప్రధమ సమావేశంలో ముఖ్య అతిథిలుగా పాల్గొని పార్టీ చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.తెలంగాణా లో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకువెళుతూ వివిధ పథకాల ప్రాముఖ్యత, ప్రజలకు జరిగే మేలు గురించి వివరించాలని వారు అన్నారు.జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలలో ఒక్కొక్క నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై సమీక్షించిన మీనాక్షి నటరాజన్, జిల్లా లోని పార్టీ నాయకులు కార్యకర్తలు మంచి సమన్వయం తో పని చేస్తున్నారని, పార్టీ నాయకులను అభినందిస్తూ, రాబోయే రోజుల్లో కూడా ఇదే పని తీరును కనపరచాలని చెప్పారు. సూర్యాపేట నియోజకవర్గం రాజకీయ వ్యవహారాలపై చర్చ జరిగిన సమయంలో, సభ్యులు మాట్లాడుతూ సూర్యాపేట నియోజకవర్గం సంబంధించి పార్టీ నిర్దేశించిన ప్రతి కార్యక్రమంలో చురుకుకుగా పాల్గొంటూ, కార్యకర్తలకు పెద్ద దిక్కుగా ఉన్నటువంటి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి కి పార్టీ సముచిత స్థానం కలిపించాలనే పి.ఏ.సి సభ్యుల సూచన మేరకు స్పందిస్తూ, పార్టీ నాయకులతో కూలంకషంగా చర్చించి త్వరలోనే ఒక సముచిత నిర్ణయం తీసుకుంటామని మీనాక్షి నటరాజన్ తెలియజేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పి.ఏ.సి సమావేశాన్నుదేశించి మాట్లాడుతూ, దేశం లో ఎక్కడా లేని విధంగా తెలంగాణ లో తెల్లరేషన్ కార్డు దారులందరికీ సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, కొత్త రేషన్ కార్డులను ఇచ్చామని, కొత్తగా కుటుంబ సభ్యుల వివరాలతో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులను కూడా ఇస్తున్నామని చెప్పారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులను గౌరవిస్తూ, నామినేటెడ్ పదవులలో వారికి ప్రాధాన్యత నివాలనే పి.ఏ.సి సభ్యుల సూచన పై స్పందించిన మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పార్టీలో కష్టపడి చేసే వారికి తప్పనిసరిగా సముచిత స్థానం కలిపిస్తామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వర రావు, మునిసిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, జిల్లా సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్ ఆలేటి మాణిక్యం, రాష్ట్ర వికలాంగుల సంస్థ చైర్మన్ వీరయ్య, కోదాడ, హుజూర్నగర్, నేరేడుచర్ల మునిసిపల్ చైర్మన్ లు ఫ్లోర్ లీడర్ లు, తదితరులు పాల్గొన్నారు..



# రైల్వే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేద్దాం

భానుపురి/సూర్యాపేట టౌన్

సూర్యాపేటకు రైల్వే సాధించాలనే లక్ష్యంతో సాగుతున్న ఉద్యమాన్ని మరింత విస్తృతం చేసి, అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేస్తూ బలమైన ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలని సూర్యాపేట రైల్వే సాధన సమితి నిర్ణయించింది. సోమవారం సమితి కార్యాలయంలో దేగల జనార్ధన్ అధ్యక్షతన జరిగిన నిర్మాణాత్మక సమావేశంలో ఉద్యమ పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రైల్వే సాధన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసే దిశగా రానున్న రెండు రోజుల్లో రెండు ర్యాలీలు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఉద్యమ నిర్మాణాన్ని క్షేత్రస్థాయి వరకు బలోపేతం చేస్తూ కార్మికులు, వృత్తిదారులు, మహిళలు, వ్యాపారులు, ఉపాధ్యాయులు, వివిధ సామాజిక వర్గాలు, ప్రొఫెషనల్స్‌ను ఉద్యమంలో క్రియాశీల భాగస్వాములను చేసేందుకు ప్రత్యేక జేఏసీలను ఏర్పాటు చేశారు. అన్ని జేఏసీల చైర్మన్‌గా చింతలపాటి చిన్న శ్రీరాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వృత్తి సంఘాల జేఏసీ కన్వీనర్‌గా రాచూరి ప్రతాప్, సామాజిక సంఘాల జేఏసీ కన్వీనర్‌గా సముద్రాల రాంబాబు, మహిళా సంఘాల జేఏసీ కన్వీనర్‌గా కె. మంజుల, వ్యాపార సంఘాల జేఏసీ కన్వీనర్‌గా బిక్కుమల్ల ఉపేందర్, ప్రొఫెషనల్ అసోసియేషన్స్ జేఏసీ కన్వీనర్‌గా డాక్టర్ రమేష్ చంద్ర, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ కన్వీనర్‌గా పోతరాజు నరసయ్యలను ఏకగ్రీవంగా నియమించారు. సూర్యాపేట రైల్వే డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం దృష్టికి మరింత బలంగా తీసుకెళ్లేందుకు సాధ్యమైనంత త్వరలో కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించారు. అదే విధంగా సామాజిక ఉద్యమ నేత మందకృష్ణ మాదిగ, బీసీ ఉద్యమ నేత ఆర్. కృష్ణయ్యలను కలిసి సూర్యాపేట రైల్వే సాధన ఉద్యమానికి మద్దతు కోరాలని తీర్మానించారు. రాజకీయాలకు అతీతంగా అన్ని ప్రజాసంఘాలు, వృత్తి సంఘాలు, సామాజిక సంఘాలు, మహిళలు, యువత, విద్యార్థులు, వ్యాపారులు, మేధావులను కలుపుకొని ఉద్యమాన్ని మరింత విస్తరించాలని సమావేశం అభిప్రాయ పడింది.




ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడు తూ సూర్యాపేటకు రైలు అనేది ఏ ఒక్క వ్యక్తికో, సంఘానికో సంబంధించిన డిమాండ్ కాదని, జిల్లా భవిష్యత్ అభివృద్ధికి సంబంధించిన ప్రజల ఆకాంక్ష అని పేర్కొన్నారు. రైల్వే సాధన కోసం ప్రజల్లో ఇప్పటికే ఏర్పడిన ఆకాంక్షను సంఘటిత శక్తిగా మలచాలని, గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉద్యమ నిర్మాణాన్ని పటిష్టం చేయాలని పిలుపునిచ్చారు. ఐక్యంగా, పట్టుదలతో ఉద్యమిస్తే సూర్యాపేట రైల్వే కలను సాకారం చేసుకోవచ్చని స్పష్టం చేశారు. సమావేశంలో గౌరవ సలహాదారు లింగంపల్లి భద్రయ్య, న్యాయవాది తలమల్ల హసేన్, డాక్టర్ రమేష్ చంద్ర, యాతాకుల రాజన్న, మంజుల, వెంకట యాదవ్, నల్లపాటి అప్పారావు, సముద్రాల రాంబాబు, అక్కినేపల్లి రాము, తల్లాడ కృష్ణమూర్తి, పోలా రాధాకృష్ణ, మధు, మహంకాళి సోమన్న తదితరులు పాల్గొని ఉద్యమ భవిష్యత్ కార్యాచరణపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. చివరగా కో-కన్వీనర్ రాచూరి ప్రతాప్ ముగింపు సందేశమిస్తూ, అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని రైల్వే సాధన ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. "సూర్యాపేటకు రైలు వచ్చే వరకు ఉద్యమం ఆగదు" అనే సంకల్పంతో ముందుకు సాగాలని సమావేశం నిర్ణయించింది.

## వందేమాతరం గీతాన్ని అవమానించిన వారిని అరెస్టు చేయాలి



భానుపురి/సూర్యాపేట టౌన్

వందేమాతరం గీతాన్ని అవమానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులను వెంటనే అరెస్టు చేయాలని బీజేవైఏం జిల్లా అధ్యక్షుడు గుణగంటి పృథ్వీ డిమాండ్ చేశారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రైతుబజార్ వద్ద అంబేద్కర్ విగ్రహం సమీపంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల దిష్టిబొమ్మలను దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో వందేమాతరం గీతాన్ని పూర్తిగా ఆలపించకుండా మధ్యలోనే నిలిపివేశారని ఆరోపించారు. వందేమాతరం గీతాన్ని, దానిని రచించిన బంకించంద్ర చటర్జీని అవమానించడం దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజల్లో జాతీయ స్ఫూర్తిని రగిలించిన వందేమాతరం గీతానికి ఎంతో చారిత్రక ప్రాధాన్యత ఉందని తెలిపారు. జాతీయ గీతాలు, జాతీయ చిహ్నాలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ కార్య క్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## మూసి నీటిని విడుదల చేయాలి

-వినతి పత్రం అందజేసిన రైతులు

భానుపురి /సూర్యాపేట



వరి పొలాలకు మూసి నీటిని విడుదల చేయాలని కోరుతూ సూర్యాపేట మండల పరిధిలోని తాళ్ల ఖమ్మంపహాడు, పెన్ పహాడ్ మండలం సింగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన రైతులు ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్, ఇరిగేషన్ శాఖ డీఇలకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామాలకు చెందిన పొలాలు 36, 37,38 మూసి కెనాల్ ఎడమ కాలువ ఆయకట్టు కింద సుమారు 300 ఎకరాల వరి పొలాలు నాటు వేశామని నీరు లేక వరిపొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ జీవనాధారమైన వృత్తి వ్యవసాయం కాబట్టి తక్షణమే తమ పొలాలకు నీటిని విడుదల చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

## మండల స్థాయి ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలి

భానుపురి/సూర్యాపేట కలెక్టరేట్



ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ప్రజలు పెట్టుకున్న అర్జీ లను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజా వాణి కార్య క్రమంపై కూడా కలెక్టర్ సమీక్షించారు. మండల స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మండల స్థాయి సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్య క్రమం లో భూ సమస్యలకి సంబందించి 43 దరఖాస్తులు, డి పి ఓ 8,డిడబ్ల్యుఓ 3, , డి ఏం అండ్ హెచ్ ఓ 3, మిగిలిన 38 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 95 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్బంగా అన్నారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డిఆర్డిఎ పిడి సన్యాసయ్య, డిఇఓ అశోక్, డిపిఓ యాదగిరి, డి ఏ ఓ శ్రీధర్ రెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు హాజరైనారు.

## ప్రతి సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం

భానుపురి/సూర్యాపేట కలెక్టరేట్



మండలంలో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 నుంచి ప్రతి సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల స్థాయి రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య, విద్య, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య శాఖ, ఫారెస్ట్, అంగన్వాడీ తదితర శాఖల అధికారులు విధిగా హాజరవుతారని, కావున ఆయా మండలలాకు చెందిన గ్రామ ప్రజలు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 01:00 వరకు తమ యొక్క సమస్యలకు సంబంధించిన అర్జీలను సమర్పించి ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

## రైల్వే సాధన సమితి మహిళ సంఘాల జేఏసి కన్వీనర్ గా మంజుల నియామకం

భానుపురి/సూర్యాపేట టౌన్

హైదరాబాద్ నుండి సూర్యాపేట మీదుగా చెన్నై వెళ్ళు రైలు మార్గం ను కొంత మంది నాయకులు దారి మళ్లిస్తున్న నేపధ్యం లో గత నెల రోజులు గా రైల్వే సాధన సమితి పేరుతో సూర్యాపేట నుండి రైల్వే మార్గం కొరకు దేగల జనార్ధన్ అధ్యక్షతన జరుగుతున్న ఈ ఉద్యమంలో మరింత సమీకరణలు పెంచే దిశగా సోమవారం రైల్వే సాధన సమితి కార్యాలయంలో వివిధ కేటగిరీలలో కన్వీనర్ లను ఏర్పాటు చేశారు. అందులో భాగం మహిళ సంఘాల కన్వీనర్ గా టి.ఆర్. పి.పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తున్న మంజుల ను కన్వీనర్ గా నియమించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆమె కు శుభాభినందనలు వ్యక్తం చేశారు..




## ప్రజల ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం

భానుపురి/డీఎస్పీ కార్యాలయం




సూర్యాపేట డివిజన్ కార్యాలయం నందు డిఎస్పీ ప్రసన్న కుమార్ పోలీస్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి బాధితుల నుండి పిర్యాదులు స్వీకరించి బాధితులతో మాట్లాడారు. సమస్యలు సంభదిత అధికారులకు ఆదేశాలు ఇచ్చి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ప్రతి సోమవారం డివిజన్ స్థాయి పోలీస్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరిగినది అని అన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపినారు.

## సబ్బండ వర్గాల స్వరం

భానుపురి /సూర్యాపేట ప్రతినిధి

కులమేదైనా వృత్తియేదైనా
మనమంతా మట్టిబిడ్డలం
చెమట చిందించి పంట పండించే సబ్బండ వర్గాల సంతతులం
రైతన్న చేతిలో పుడుతుంది
దేశానికి అన్నం పెట్టే గింజ
కూలన్న చేతిలో రూపుదిద్దుకుంటుంది
మన ఊరి ప్రతి ఒక్క భవనం
చేతివృత్తుల కళలో దాగుంది తరతరాల సంస్కృతి వైభవం
కార్మికుడి శ్రమలో కనిపిస్తుంది అభివృద్ధికి అసలైన రూపం
చేనేత చీరలో అందం నింపే
నేతన్న నైపుణ్యం మన గర్వం చేతివృత్తుల జీవనంలో వెలిగే
మన మట్టి సంస్కృతి పరిమళం
స్త్రీ అయినా పురుషుడైనా
శ్రమకు లేదు ఎలాంటి తారతమ్యం అందరి చెమట చుక్కలతోనే
నిర్మితమవుతుంది ఈ సమాజం
ఎవరినీ తక్కువ చేయకుండా
ఎవరికీ తలవంచకుండా
ఆత్మగౌరవమే ఆయుధంగా
అందరం కలిసి ముందుకు సాగాలి
సబ్బండ వర్గాల స్వరం ఒక్కటై సమానత్వ గీతం ఆలపించాలి కులమతాల గోడలు కూల్చి
మానవత్వమే చాటాలి
మన చేతులే మన బలం
మన శ్రమే మన సంపద
సబ్బండ వర్గాల ఐక్యతతో
సమాజమే కావాలి సుందర భవిత!

– మిత్రాజి
( గుండవరం ప్రభాకర్ రావు పంతులు )
ఫోన్ నం. 9949267638
అత్వెల్లి గ్రామం,మేడ్చల్ జిల్లా